క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్



సబ్‌కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న మంత్రాలయం తహసీల్దార్ రమాదేవి

ఆదోని రూరల్: మంత్రాలయం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రమాదేవి మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిసి పూలమొక్కను అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్‌కు సూచించారు.

ఎస్సీ కాలనీపై వివక్ష ఎందుకు?

కౌతాళం: ఎస్సీ కాలనీపై వివక్ష ఎందుకు చూపుతున్నారని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య ప్రశ్నించారు. సీపీఎం బృందం మంగళవారం మండల పరిధిలోని కరణి గ్రామాన్ని సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో ఏ ఒక్కచోట కూడ డ్రైనేజీ, సిమెంటు రోడ్లు వేయకుండా కుల వివక్ష చూపుతూ, రోడ్లు వేయకుండా ఉన్నారని ఆరోపించారు. కూటమి నాయకులు స్పందించి కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలన్నారు. బృందంలో సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న, నాయకులు చిన్న మారయ్య, నాగరాజు, కాలనీ వాసులు శివయ్య, హుసేని తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: క్షయ వ్యాధి పట్ల అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జాలవాడి లక్ష్మన్న, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, వేణుగోపాల్, టీబీ సూపర్‌వైజర్స్ చాంద్ బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి నవోదయ కళాశాలకు ఎంపిక



రక్షిత



రాకేష్

కౌతాళం: (కోసిగి) కోసిగి విద్యార్థులు సత్యసాయి జిల్లా లేపాక్షి నవోదయ కాలేజీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సమీరా రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన రక్షితతో పాటు ఏపీ మోడల్ పాఠశాలలో చదివిన రాకేష్ లేపాక్షి కాలేజీలో ఎంపీసీ సీటును సాధించారని చెప్పారు. ఇద్దరు ఎంపిక పట్ల ఉపాధ్యాయుడు రాజేష్, గ్రామస్తులు మంగళవారం విద్యార్థులకు అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించండి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రమిస్తున్న గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, గ్రామస్తులు

నందవరం : మండల పరిధిలోని కనకవీడు గ్రామ పంచాయతీకి ఉపాధి పనులు నిర్వహించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిందన్నారు. దీంతో గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పనులు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వేసవిలో మండలంలో అన్ని గ్రామాలలో ఉపాధి పనులు చేపడుతుంటే తమ గ్రామంలో మాత్రం పనులు జరగలేదని వివరించారు. దీంతో గ్రామస్తులు కూలీలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

బియ్యం మాయంపై కేసు నమోదు

ఆదోని అర్బన్: సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం మాయమవడంపై మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తహసీల్దార్ ఎం.ఎ.రమేష్ తెలిపారు. ఈనెల 13న ఓ ప్రైవేటు గోదాములో వీఆర్వో రాజశేఖర్‌గౌడ్, డైరెక్టర్ మహేష్‌గౌడ్ తనిఖీ చేసి అక్రమంగా నిల్వవుంచిన 1500 బస్తాల పీడీఎస్ బియ్యం సీజ్ చేశారన్నారు. అయితే ఉదయం గోదాము తెరిచి చూడగా అందులో 109 సంచులు మాత్రమే ఉన్నాయని, మిగతావి కనిపించలేదన్నారు. ఈ మేరకు వీఆర్వో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ సీఐ రాజశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారన్నారు.

వానాకాలం..

నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

- ఈదురు గాలులు, వర్షాలకు నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు
- తీగలు, స్తంభాలను తాకడంతో ప్రమాదాల బారిన పడుతున్న మనుషులు, పశువులు
- జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చంటున్న విద్యుత్ అధికారులు
- విద్యుత్ పరికరాల ఉపయోగంలోనూ అప్రమత్తత అవసరం



ఎం.ఎం.రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్

- మండలంలోని కపటి గ్రామంలో ఈనెల 11న సూరి అనే బాలుడు ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎద్దు కొమ్ములకు రంగు పూసి అక్కడే ఉన్న షెడ్ యాంగ్లర్‌ను పట్టుకోవడం, దానికి విద్యుత్ ప్రవాహం ఉండటంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. గ్రామానికి ఈరన్న, లక్ష్మి దంపతులకు చిన్న కుమారుడు సూరి 8వ తరగతి చదువుతున్నాడు. దీంతో ఆ గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి.
- మే నెల 26వ తేదీన మండలంలోని విరుపాపురం గ్రామంలో వృద్ధుడు గొల్ల మద్దయ్య కుళాయిలకు మంచినీరు రావడంతో మోటార్ వేసేందుకు స్విచ్ నొక్కాడు. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.
- నెలరోజుల్లో పెళ్లి కావాల్సిన యువతి మే 22వ తేదీన విద్యుత్ ఘాతంతో మృతిచెందింది. ఆస్పరిలోని పింజారి షబేరా అనే యువతి కుళాయికి విద్యుత్‌మోటార్ వేసే సమయంలో విద్యుత్‌షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందింది. విద్యుత్ పరికరాలపై సరైన అవగాహన లేక,జాగ్రత్తలు పాటించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు ఏదో ఒకచోట చోటుచేసుకుంటున్నాయి.

ఆదోని అర్బన్: వర్షాకాలం ఆరంభమయ్యింది. పిడుగులు, ఉరుములు, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరుగుతుంటాయి. ఇలాంటివి జరుగుతున్న సమయంలో విద్యుత్ తీగలు కిందకు పడడం, తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వాటిని తాకడం వల్ల విద్యుత్‌షాక్‌కు గురవుతుంటారు. అంతేగాకుండా ఇళ్లల్లో తడి చేతితో స్విచ్‌లను తాకడం, ఇళ్లలో ఎర్తింగ్ లేకపోవడం, విద్యుత్ సమస్య వచ్చిన వెంటనే అవగాహన లేక విద్యుత్ పరికరాలను తాకడం వల్ల కూడా షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే వ్యవసాయ భూముల్లో గాలికి పడిన తీగలను ముట్టుకోవడం, ఎద్దులను విద్యుత్ స్తంభాలకు కట్టి వేయడం వల్ల మనుషులు, పశువులు షాక్‌కు గురవుతున్నాయి. ఇలాంటి ప్రమాదాల బారిన పడకూడదంటే తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆదోని సబ్‌డివిజన్‌లో 1,92,352 గృహ విద్యుత్ కనెక్షన్లు..

ఆదోని డివిజన్ పరిధిలో పత్తికొండ, ఆలూరు, ఆదోని సబ్‌డివిజన్‌లు ఉన్నాయి. ఆదోని సబ్‌డివిజన్‌లో 1,92,352 గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాణిజ్యపరంగా 21,523, పరిశ్రమలు 541, వ్యవసాయ కనెక్షన్లు 34,738, మిగతావి స్ట్రీట్ లైట్లు, హాస్టళ్లు, పాఠశాలలు మొత్తం కలిపి 3,787 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందుకు మొత్తం ట్రాన్స్‌ఫార్మర్లు 17,780 ఏర్పాటు చేశారు.

విద్యుత్‌షాక్‌కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తడి చేతులతో, తడిచి ఉన్న విద్యుత్ పరికరాలను తాకరాదు.
- విద్యుత్ పనులు సొంతంగా నిర్వహించుకోరాదు.
- విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా, వేలాడుతూ ఉన్న వాటిని పట్టుకోరాదు. ఆ వైపు ఎవరినీ వెళ్లకుండా చూడాలి. వెంటనే సంబంధిత లైన్‌మెన్, అధికారికి సమాచారం అందించాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు పోయినప్పుడు కరెంట్ లేదని సొంతంగా మరమ్మతు చేయరాదు.
- విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లపైకి అనధికారిక వ్యక్తులు ఎక్కరాదు.
- మోటార్ సామర్థ్యానికి అనుగుణంగా నాణ్యత కలిగిన తీగలను వాడాలి.
- సర్వీసు వైర్లు అతుకులు, జాయింట్లు వదులుగా ఉండడం, స్టార్టర్‌లు, తీగలను నేలపై పెట్టడం ప్రమాదకరం. స్టార్టర్‌కు పైకప్పు తొలగించకూడదు. స్టార్టర్ ఉంచిన ఐరన్ బాక్సును తెరిచే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
- మోటార్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించుకోవాలి. తడి ఉన్నప్పుడు పంపుసెట్‌ను ఆన్ చేయరాదు.
- విద్యుత్ లైన్ల కింద చెట్లు నాటడం, తీగలకు తాకిన చెట్టు, కొమ్మలను ఎక్కడం వంటివి చేయరాదు.
- స్తంభాలకు ఆధారంగా ఉన్న స్టే తీగను తొలగించడం, వాటికి పశువులను కట్టివేయడం సరైంది కాదు. పొలంలో తెగిపడి ఉన్న తీగలను చేతితో తొలగించడం, పక్కకు జరపడం వంటివి చేయరాదు.
- పొడవైన ఇనుపరాడ్లు, బోరుపైపులు, కేసింగ్ పైపులు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగలకు తాకకుండా జాగ్రత్తలు వహించాలి.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి ప్లాస్టిక్ లేదా పొడవాటి కర్రతో ఆ వ్యక్తిని తప్పించాలి.
- ఐఎస్ఐ మార్కు కలిగిన పంపుసెట్ వాడడం వల్ల కరెంట్ పొదుపు అవ్వడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు.
- మోటార్‌లకు కెపాసిటర్‌లను పెట్టుకోవడం వల్ల కరెంట్ ఆదాతో పాటు ఓల్టేజీ సమస్య తగ్గుతుంది.
- విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, ఓల్డర్‌లు, పరికరాలను నాణ్యత కలిగిన వాటినే ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు. ఇంట్లో స్విచ్‌బోర్డులను తగినంత ఎత్తులో ఉంచుకోవాలి. దీంతో పిల్లలకు సురక్షితం.
- ప్రతి ఇంట్లో విద్యుత్ సర్వీసుకు ఎర్తింగ్‌ను ఏర్పాటు చేయాలి.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు ముట్టుకోరాదు.
- ఇళ్లు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేయాలి. తడి చేతులతో, తడికాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదు. అవసరమైతే రబ్బర్ చెప్పులను వాడాలి. విద్యుత్ సమస్య వస్తే ఇతర ప్రైవేట్ వ్యక్తులను సంప్రదించకుండా విద్యుత్‌శాఖ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలి. ఇళ్ల మిద్దెలపై బట్టలను విద్యుత్ లైన్‌లపై ఆరవేయరాదు.
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగితే సమస్య పరిష్కారానికై విద్యుత్‌శాఖ సిబ్బందికి లేదా 1912కి తెలియజేయాలి.

నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే హాని



పరిశ్రమలు, ఇళ్లల్లో, వ్యవసాయ రంగంలో విద్యుత్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే హానీ. విద్యుత్ సమస్య వస్తే వెంటనే 1912కు సమాచారం ఇవ్వండి. లేదా దగ్గరలోనే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయండి. సొంతంగా పరిష్కరించడానికి వెళ్లవద్దు. విద్యుత్‌పై తగిన జాగ్రత్తలు, సూచనల కోసం గ్రామాల్లో, మండలాలు, పట్టణాలు, సబ్‌స్టేషన్‌లలో ప్రజలకు, రైతులకు, పరిశ్రమల యజమానులకు సూచనలిస్తున్నాం. తాము ఏర్పాటు చేసిన కేంద్రంలో సమస్యలపై ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నాం. ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా విద్యుత్ సిబ్బంది స్పందించకపోతే డీఈ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

– పురుషోత్తం, విద్యుత్‌శాఖ, ఆదోని ఇన్‌చార్జ్ డీఈ

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో శివశంకర్, సర్పంచ్ రంగస్వామి

ఎమ్మిగనూరురూరల్: ఖరీఫ్ పంటల సాగులో రైతుల సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, మండల వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అధికారుల సూచనల మేరకు సాగు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనానికి ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని, అలాగే భూసార పరీక్షలు ఆధారంగా భూసారాని బట్టి పంటలు సాగుచేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగస్వామి, ఏఈవోలు నరసింహులు, వినోద్, శ్రీనిధి, సోమన్న, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

కౌతాళం (కోసిగి): పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మౌనిక అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కోసిగిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకే పొలంలో రైతులు పత్తి విత్తనాలతో పాటు మధ్యలో అంతర పంటగా కందులు కూడా సాగుచేసుకునేలా సూచనలిచ్చారు. పత్తితో పాటు జొన్న, కందులు, సజ్జ, కొర్రలు వంటి పంటల్ని సాగుచేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం, నారాయణపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లోని రైతులను కలిసి వారికి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కౌలు సాగుదారులు ఎవరైనా ఉంటే వారికి కౌలు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్, వీఏఏలు మౌనిక, రామకృష్ణ, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయవద్దు

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీ వర్కర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ వర్కర్లకు ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు పిల్లలను రప్పించేలా చూసుకోవాలని చెప్పారు. వర్కర్లు, ఆయాలు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, సకాలంలో కేంద్రాలకు వెళ్లాలన్నారు.

42వ రోజుకు చేరుకున్న దీక్షలు

ఎమ్మిగనూరుటౌన్: సమస్యల సాధనకై మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 42వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం దీక్షలో కూర్చున్న ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే పట్టణంలో వీధి దీపాలు వెలగనివ్వకుండా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేంద్ర పాల్గొన్నారు.

ఆదోనిలో 14వ రోజుకు చేరిన సమ్మె

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారానికి 14వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా సోమన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 43వ రోజుకు కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా పట్ల సానుకూలత చూపి మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

గోనెగండ్ల : మండల కేంద్రానికి చెందిన బాలముని(44) అనే వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు గోనెగండ్లలోని ఉప్పరి వీధికి చెందిన ఉప్పరి బాలమునికి భార్య నరసమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే బాలమునికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే సోమవారం మద్యం తాగేందుకు భార్య నరసమ్మను డబ్బులు అడిగాడు. దీంతో ఆమె డబ్బులు లేవని, పిల్లలు పెరుగుతున్నారని డబ్బులు పొదుపు చేసుకోవాలని భర్తకు చెప్పింది. దీంతో ఆవేశానికి లోనైన బాలముని సోమవారం సాయంత్రం పంట పొలాల దగ్గరకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి చేరుకొని భార్యకు విషయం తెలిపాడు. దీంతో ఆమె బంధువుల సహాయంతో బాలమునిని గోనెగండ్ల ఆస్పత్రికి తరలించింది. అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించారు. మంగళవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు సీఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

యోగాంధ్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ నాసరరెడ్డి

నందవరం : ఈ నెల 21వ తేదీన ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో యోగాంధ్రపై సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలో ఆయా కేంద్రాలలో యోగా శిక్షణ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఎంత మందిని రిజిస్ట్రేషన్ చేశారు, యోగా శిక్షణకు ఎంత మంది హాజరవుతున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మాస్టర్ ట్రైనర్లు, టీటీలు తప్పని సరిగా ప్రతి రోజు యోగా శిక్షణ ఇవ్వాలసిందేనని, ప్రతి ఒక్కరూ హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, ఏఓ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, యోగా శిక్షణ మాస్టర్ ట్రైనర్లు, టీటీలు పాల్గొన్నారు.

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించండి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని సెంట్రల్: తల్లిదండ్రులు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేయాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో ఉన్న బాలికల వసతిగృహం, బాలుర ఎస్సీ వన్, బాలుర కళాశాల వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టగా మంగళవారం వాటిని పునః ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలామంది నిరుపేదలు, మధ్యతరగతి వారు బతుకుదెరువు కోసం వలస వెళుతూ తమ పిల్లలను విద్యకు దూరం చేస్తున్నారన్నారు. అలాంటి వారికి ఈ వసతి గృహాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తల్లిదండ్రులు వలసల వెళ్లినప్పుడు వారి పిల్లలను హాస్టళ్లలో వదిలి చదివించవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, హాస్టల్ వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న సొసైటీ సభ్యులు

ఎమ్మిగనూరురూరల్/టౌన్: పట్టణంలో ఓ అనాథ శవానికి పూలే అంబేడ్కర్ ఎడ్యూకేషనల్ సొసైటీ సొసైటీ వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న, గౌరవ సలహాదారుడు గణేష్, పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యూఎం. ఏంకోబులు మంగళవారం శ్మశాన వాటిలో అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా ఉన్న కరెంట్ డీప్ పక్కన సోమవారం 45 సంవత్సరాల వ్యక్తి పడివుండటం చూసి స్థానికుల పట్టణ పోలీసులకు సమాచారం అందటంతో శవాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలియకపోవడంతో సొసైటీ సభ్యులకు పట్టణ పోలీసులు సమాచారం అందించటం వారు అక్కడికి చేరుకొని మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. సొసైటీ జిల్లా అధ్యక్షుడు సాతర్ల ప్రసాద్, సామాజిక సేవ కార్యకర్త నరేష్, మల్లెపోగు అబ్రహం, కానిస్టేబుల్ నవాజ్ పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

గోనెగండ్ల : విధులకు సక్రమంగా హాజరుకాని వెల్ఫేర్ అసిస్టెంట్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని చిన్నమరివీడు గ్రామస్తులు లేపాక్షి నాయుడు, మురళి, ఉసేని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని చిన్నమరివీడు గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద గ్రామస్తులు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ చిన్నమరివీడు గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అశ్విని విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రస్తుతం రేషన్ కార్డులో మార్పులు చేర్పులు, కొత్తరేషన్ కార్డు మంజూరుకు అవకాశం కల్పించిందన్నారు. అయితే గ్రామంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ సక్రమంగా విధులకు రాకపోగా.. వచ్చినా ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలపై మండిపడుతుందన్నారు. రెండు రోజులుగా ఆమె విధులకు రాలేదని, దీంతో గ్రామస్తులు పనుల నిమిత్తం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. అధికారులను ఆరా తీస్తే తమకు తెలియదని చెబుతున్నారన్నారు. గ్రామస్తులు దేవదాసు, ప్రకాష్, ఆనంద్, వెంకటేష్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల వివరాలు ప్రదర్శించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల వద్ద తీసుకొనే ఫీజు వివరాలను నోటీస్ బోర్డుల్లో పొందుపరచాలని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సొసైటీ అధ్యక్షుడు మణికుమార్, సభ్యులు ప్రసన్నకుమార్, పంపయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఈఓ -1 ఆంజనేయులుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం



కౌతాళంలో వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం



గోనెగండ్లలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, నాయకులు

కౌతాళం: వెన్నుపోటు చంద్రబాబు నైజమని మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణను నాయకులతో కలిసి చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. కార్యక్రమంలో యువజన మండల అధ్యక్షుడు తాహెర్‌వలి, వైస్ సర్పంచ్ తిక్కయ్య, నాయకులు వడ్డెరాము, ఖాదర్‌లింగ, వార్డు మెంబర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు చీకటి రోజులు

గోనెగండ్ల : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ప్రజలకు చీకటి రోజులని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాలూకా బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ నాయుడు, మండల ఉపాధ్యక్షులు చికెన్ రాజా, అల్లాబకాష్, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, నాయకులు దొరబాబు, ఇమ్రాన్, మునెప్ప, ఖాజా పటేల్ తదితరులు పాల్గొన్నారు.



నందవరంలో పుస్తకావిష్కరణలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

సూపర్‌సిక్స్ పథకాలతో వెన్నుపోటు

నందవరం : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నాయకులతో కలిసి వెన్నుపోటు పుస్తకాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఎంపీటీసీ విజయ మోహన్‌రెడ్డి, చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పేట శ్రీనివాసరెడ్డి, నాయకులు రామకోటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, సోమశంకరరెడ్డి, ఎల్లాగౌడ్, రమేశప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



గువ్వమ్మసందు కొండల్లో నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గువ్వమ్మసందు కొండల్లో నాటుసారా తయారీ కోసం సిద్ధం చేసిన 270 లీటర్ల బెల్లం ఊటను, సారా బట్టీని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే 7 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదోనిలోని వాల్మీకినగర్‌కు చెందిన జగ్గాపురం ఈరన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా కోసిగి మండలం అర్లబండ గ్రామానికి చెందిన వందగల్లు ఈరేష్ అనే వ్యక్తిని కర్ణాటక మద్యం సరఫరా చేస్తుండగా పెద్ద తుంబళం గ్రామ శివారులో అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 4 కర్ణాటక మద్యం బాటిళ్ల బాక్సులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుధ్య పనుల పట్ల కార్మికులు నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, గాంధీ సర్కిల్, మార్కెట్ ఏరియా, గంజిళ్ల రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా శ్రీనివాస సర్కిల్‌లో వున్న అన్న క్యాంటిన్‌లో భోజన పంపిణీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

కూలిన వంతెన.. నిలిచిన రాకపోకలు



కుంబళనూరు వద్ద కూలిపోయిన వంతెన

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు–హాల్వి గ్రామాల మధ్య వాగుపై ఉన్న వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామాల ప్రజల మధ్య సత్సంబంధాలు దూరమవుతున్నాయి. ఆర్టీసీ సర్వీసులు కూడా నిలిచిపోవడంతో కుంబళనూరు గ్రామ ప్రజలు కుంబళనూరు క్యాంపు-1, క్యాంపు-2, నదిచాగి, మేళిగనూరు ప్రజలు, విద్యార్థులు హాల్వి గ్రామానికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాల్వి నుంచి కర్ణాటకలోని శిరుగుప్పకు వెళ్లేందుకు కూడా రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. వంతెన దెబ్బతిని రెండు నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.